
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

OCTOBER 2005

# సంక్షిప్తవార్తలు

2005 ఆగష్టు 30వ తేదీ మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా నర్సారావ్‌పేట, బాపనయ్య నగర్‌లో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును జాషువాగూటం గారు రిబ్బను కత్తిరించి ప్రభువు సేవకొరకై ప్రతిష్ఠించిరి. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమము ఘనముగా జరిగెను. ఆ సందర్భముగా రిక్కీగూటం గారు, జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. సోదరి కబితా గూటంగారు, టి.రాజుగారు, యాజలి మోజెస్‌గారు, యస్.టి.జయారావుగార్లు మరియు తదితర్లు పాల్గొనిరి. రిటైర్డ్ హెడ్మాస్టార్ జయరావుగారు బాప్తిస్మము రక్షణను గూర్చి తాను రచించిన పద్య కావ్యమును వినిపించి సభికులను సంతోష పరచిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసిరి. నర్సారావ్‌పేట బాపనయ్య నగర్‌లో సోదరులు యస్.శేఖర్‌పాల్‌గారు వాక్యపరిచర్య చేయుచు సంఘమును నడిపించు చున్నారు.

2005 సెప్టెంబర్ 5,6 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం కుమ్మరవీధిలో యున్న క్రీస్తుసంఘము సువార్త కూటములు నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు సుగుణరావ్ (సావరం, రాయవరం), దేసింగ్ (ఆర్.సి.పూర్), జాషువా (పందలపాక), మరియు రిక్కీ గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. కూటములకు ముందు రోజునే యిద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సువార్త కూటములు ఘనముగా జరిగెను. కుమ్మర వీధిలో యున్న సంఘములో సోదరులు యస్.ప్రసాద్ గారు పరిచర్య చేయు చున్నారు.

సెప్టెంబర్ 7వ తేదీ బుధవారం కృష్ణాజిల్లా చనుబండలో యున్న తిమోతి బైబిలు స్కూల్ ఫర్ రూరల్ యుత్ యొక్క 5వ వార్షికోత్సవము సకాలమునకు ప్రారంభించబడి ఘనముగా నిర్వహించబడెను. సోదరులు రిక్కీ గూటంగారు ప్రత్యేక ప్రసంగీకులుగా ఆహ్వానించబడగా ఆయన ఫోటో

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O.Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 26 అక్టోబర్ 2005 సంచిక 3


## యేసుక్రీస్తు యొక్క దైవత్వము

(The Divinity of Jesus)

మొదటి శతాబ్ధము నుండి నేటి వరకు జీవించియున్న మానవులందరు ఈ లోకమందు అవతరించిన యేసుక్రీస్తు యొక్క అసామాన్య జీవితమును, ఆశ్చర్య క్రియలను, గంభీరమైన జ్ఞానమును, ఘోరమైన మరణమును గూర్చి తలంచు నప్పుడు ఆశ్చర్యచకితులవు చున్నారు. ఆయన ఒక అసాధారణ మానవుడని కొందరు అన్నారు. కొందరు ఆయన ఒక ప్రవక్త అన్నారు. మరికొందరు చనిపోయిన బాప్తిస్మమిచ్చు యోహానే తిరిగి వచ్చాడన్నారు. మరికొందరయితే ఆయన దేవుని కుమారుడు, అందువలన ఆయనే దేవుడు అని అన్నారు.

అయితే యేసుక్రీస్తు నిజముగా యెవరు? ఆయన విషయమై బైబిలు ఏమి బోధించుచున్నది? ఈరోజు ఆ సంగతు లను గమనించుదాం. యేసుక్రీస్తు కేవలం మనుష్యమాత్రుడే యనుకొనువారు ఆయనను గూర్చి బైబిలునందు చదువు

చున్నప్పుడు అభ్యంతరపడుదురు.

యేసుక్రీస్తు మానవుని కంటె మిన్నయైనవాడని క్రొత్తనిబంధన సూచించుచున్నది. తండ్రియైన దేవుడు నేను ఏకమైయున్నామని క్రీస్తు బోధిస్తు యుండేవారు (యోహాను 10:30). యోహాను 14:10లో తండ్రియందు నేనును, నాయందు తండ్రియు యున్నాము అని ఆయన చెప్పెను. మరల, తన అనుచరులను గూర్చి క్రీస్తు ప్రార్థిస్తూ, "పరిశుద్ధుడవైన తండ్రీ, మనము ఏకమై యున్నలాగున వారును ఏకమై యుండునట్లు నీవు నాకు అనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము" అని యోహాను 17:11లో పలికెను. అదే ప్రార్ధనలో, తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏక్షమై యుండవలెనని తన శిష్యులకొరకు ఆయన విజ్ఞాపన చేసెను (17:20).

యేసుక్రీస్తు దేవునితో సమానుడు. ఫిలిప్పీ 2:5-11లో మనము చూచిన అపొ.పౌలు ఇట్లు మనకు బోధించుచున్నాడు: "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగి యుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను. అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలోగాని, భూమిక్రింద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను".

యేసు యూదుల "విశ్రాంతి దినాచారమును మీరుట మాత్రమే గాక దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి తన్ను దేవునితో సమానునిగా చేసికొనెను గనుక ఇందు నిమిత్తమును యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి" యని యోహాను 5:18లో వ్రాయబడియున్నది.

యేసుక్రీస్తు దేవుడై యుండెను. తండ్రియైన దేవుడు కుమారుడైన యేసు క్రీస్తును ఉద్దేశించి, "దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది. అందుచేత

దేవుడు నీ దేవుడు, నీతోడి వారికంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనంద తైలముతో అభిషేకించెను" అని పలికెను (హెబ్రీ 1:8-9). యేసు ఆది నుండి దేవుడై యుండి, దేవుని యొద్ద ఉండెను అని అపొస్తలుడైన యోహాను వ్రాసెను (యోహాను 1:1-2). దీనిని బట్టి త్రియేక దేవునిలో యున్న ముగ్గురు వ్యక్తులు ఏకమై యున్నారని మనము గ్రహించు కొన గల్గుచున్నాము. "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" యని అపొ.పౌలు కొలస్స 2:9లో వ్రాసెను.

ఇంతవరకు మనము చూచిన లేఖములను బట్టి యేసుక్రీస్తు దేవునితో ఏకమై యున్నాడనియు, దైవ సమాను డనియు, దేవుడనియు గమనించి యుంటిమి. ఆయనలో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, ఆయన ఈలోకములో కన్యయైన మరియ గర్భమున జన్మించక ముందునుండే యున్నవాడు. ఆయన ఎల్లప్పుడు ఉండువాడు. ఆనంతము నుండి, ఆనంతము వరకు ఉండువాడు.

అందువలననే బాప్తిస్మమిచ్చు "యోహాను ఆయనను గూర్చి సాక్ష్య మిచ్చుచు నావెనుక వచ్చువాడు నాకంటే ప్రముఖుడు గనుక ఆయన నాకంటే ముందటివాడు" అని పలికెను (యోహాను 1:15, 30). యోహాను కంటే రెండువేల సంవత్సరములకు ముందు జీవించిన అబ్రాహాముకంటే ముందు నుండి యేసు క్రీస్తు ఉండెను. "యేసు అబ్రహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 8:58).

ఈలోకము పుట్టక మునుపునుండే నేను ఉన్నానని యేసుక్రీస్తు ప్రకటించెను. తండ్రియైన దేవునికి ఆయన చేసిన ప్రార్థనలో, "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో, ఆ మహిమలో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము" అని ప్రార్థించెను (యోహాను 17:5, 24).

ఈ లోకము, అందున్న సమస్తమును యేసుద్వారా కలిగెను. అందువలన సమస్తమును కలుగక ముందునుండే ఆయన ఉండెను. "సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు" అని భక్తుడైన యోహాను వ్రాసెను (యోహాను 1:3). ఎఫెసులో యున్న సంఘమునకు వ్రాస్తూ, "శోధింప శక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టిం చిన దేనియందు పూర్వకాలము నుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికినీ తేట పరచు టకును, పరిశుద్ధులందరిలో అత్యల్పు

డనైన నాకు ఈ కృప అనుగ్రహించెను" అని అపో. పౌలు వ్రాసెను (ఎఫెసీ 3:9).

"ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు" అని పౌలు కొలస్సయులకు వ్రాసెను (కొలస్స 1:16,17). "పూర్వకాలమందు నానా సమయములలోను, నానావిధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" అని హెబ్రీ 1:1-2 చెప్పుచున్నది.

యేసుక్రీస్తు ఆదినుండియు దేవుడై యుండెను. అందువలన దేవుడు నరులను చేయతలంచినప్పుడు, "మన స్వరూపమందు, మన పోలికచొప్పున నరులను చేయుదము" అని తన్ను తాను బహువచనములో సంబోధించుకొనెను (ఆది 1:26). "పురాతన కాలము మొదలుకొని, శాశ్వత కాలము ఆయన ప్రత్యక్ష మగుచుండెను" అని యేసును గూర్చి మీకా ప్రవచించెను (మీకా 5:2). ఆయన శాశ్వతకాలము నుండి యున్న వాడు గనుక, "యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగ యుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ 13:8).

యేసుక్రీస్తు కుమారుడైన దేవుడై యుండి, దేవునితో సమానత్వము కలిగి యుండగా ఈలోకమునకు ఆయన రావలసిన పని యేమున్నది? అని కొందరు ప్రశ్నించెదరు. అట్లు ప్రశ్నించుట మంచిదే. యేసుక్రీస్తు ఈలోకములోనికి ఎందుకు అవతరించారు?

మొదటి స్త్రీ పురుషులను దేవుడు సృజించి, వారిని ఏదేను అను ఒక వనములో ఆయన ఉంచి, "ఈ తోటలో నున్న ప్రతి వృక్షఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును; అయితే మంచిచెడ్డల తెలివి నిచ్చువృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:16-17). అయితే సాతానుడు సర్పము రూపమున వచ్చి స్త్రీని మోసగించగా "ఆమె దాని ఫలములను కొన్ని తీసికొని తిని, తనతో పాటు తన భర్తకును ఇచ్చెను, అతడు

కూడ తినెను" (ఆది 3:6).

దేవుడు నిషేధించిన క్రియను మొదటి మానవులు చేయుట వలన ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిగా వారు దేవుని ఆజ్ఞను అతిక్రమించిరి. దేవుని "ఆజ్ఞాతిక్రమమే పాపము గనుక", పాపము ఈ లోకములో అట్లు ఉద్భవించెను (1 యోహాను 3:4).

"అప్పుడు దేవుడైన యెహోవా స్త్రీతో నీవు చేసినది యేమిటని అడుగగా స్త్రీ-సర్పము నన్ను మోసపుచ్చినందున తింటిననెను. అందుకు దేవుడైన యెహోవా సర్పముతో నీవు దీనిని చేసినందున పశువులన్నిటిలోను,భూజంతువులన్నిటిలోను నీవు శపించబడినదానవై నీ కడుపుతో ప్రాకుచు నీవు బ్రదుకు దినములన్నియు మన్ను తిందువు. మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదువని చెప్పెను. ఆయన స్త్రీతో నీ ప్రయాసమును, నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు; నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును; అతడు నిన్ను ఏలును అని చెప్పెను. ఆయన ఆదాముతో నీవు నీ భార్యమాట విని తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు. నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు; ఏలయనగా నీవు నేలనుండి తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను" (ఆది 3:13-19).

"ఇట్లు ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" (రోమా 5:12).

మానవుల పాపములు వారిని దేవుని నుండి వేరుపరచెను (యెష 59:1-2). ఆదామును దేవుడు ఏదెనుతోట నుండి వెళ్ళగొట్టెను (ఆది 3:24). అయితే పాపవిమోచన కొరకు మానవుడు బలుల నర్పించమొదలిడెను గాని జంతు బలులు పాపములను తీసివేయలేకపోయెను. "అయితే ఆ బలులు అర్పించుటచేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:3-4).

మానవుని తిరిగి తన యొద్దకు చేర్చుకొను నిమిత్తము దేవుడు తన

కుమారుడైన యేసుక్రీస్తును విమోచకునిగా పంపించెను. క్రీస్తును ఈ లోకమునకు పంపించుట ద్వారా దేవుడు తన ప్రేమను మనయెడల వెల్లడిపరచెను. ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము (రోమా 5:8-9).

# పాపము నుండి విడుదల

(Deliverance from Sin)

ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో బానిసలుగా యుండిరి. వారి బానిసత్వము మనము పాపమునకు చేయు బానిసత్వమునకు ఛాయగా యున్నది. వారి విమోచన మన విమోచనకు గురుతుగా యున్నది. మేఘములోను సముద్రములోను వారు పొందిన బాప్తిస్మము మనము క్రీస్తులోనికి పొందు బాప్తిస్మమునకు సారూప్యముగా యున్నది. వారు అరణ్యముగుండా చేసిన ప్రయాణము క్రైస్తవ జీవితమునకు గురుతుగా యున్నది. వారు యొర్దాను దాటుట మరణమునకు గురుతుగా యున్నది. మరియు వారు చేరుకొనిన కానాను దేశము పరలోకమును సూచించుచున్నది.

"ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియేగాని ఆ వస్తువుల నిజ స్వరూపముగలది కాదు" అని హెబ్రీ 10:1లో వ్రాయబడియున్నది. గనుక రాబోవుచున్న శ్రేష్ఠమైన సంగతులను గూర్చి దేవుడు ముందుగనే అలంకారరీతిగను, ఛాయరీతిగను తెలియజేసెను. పాత నిబంధనలో క్రొత్త నిబంధన మరుగై యుండెనని, క్రొత్తనిబంధనలో పాత నిబంధన బయల్పాటు చేయబడెనని ఒకాయన చెప్పారు. అది ముమ్మాటికి నిజమేయని ఈరోజు మన పాఠములో తెలిసికొన బోవుచున్నాము. ఈనాడు మనము పాతనిబంధన ప్రకారము పరిపాలింపబడక పోయినను ఆకాలమందు దేవుడు తన ప్రజలతో జరిగించిన సంప్రదింపులను గూర్చి తెలిసికొనుట యుక్తము. మరియు "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగు

టకై వ్రాయబడెను" అని 1 కొరింధి 10:11లో వ్రాయబడి యున్నది.

క్రీస్తు సంఘస్థులు పాతనిబంధనను లేదంటూరు, కాదంటూరు అని అపవాది ఒక అబద్ధ ప్రచారాన్ని కొనసాగించు చున్నాడు. నిజక్రైస్తవుడయిన ప్రతివాడు పాతనిబంధన గ్రంధమును నమ్మవలెను. ప్రతిక్రీస్తు సంఘసభ్యుడు అది పరిశుద్ధాత్మ ఆవేశమువలన ఈయబడిన దేవుని వాక్యమని నమ్మును. ఎటొచ్చీ అది ఈనాడు మనము అనుసరించవలసిన చట్టము కాదని, దానిని క్రీస్తు తన సిలువలో నెరవేర్చెనని క్రొత్త నిబంధన బోధించు దానిని క్రీస్తు సంఘస్థులు నమ్ముదురు. ప్రకటించుదురు. అంతేకాని పాతనిబంధన లేదని ఎవడు చెప్పజాలడు. చెప్పడుకూడ, అపవాది మాత్రమే అట్లు చెప్పును.

ఇశ్రాయేలీయులు ఐగుప్తులో చేసిన బానిసత్వము మనము పాపముకుచేయు బానిసత్వమునకు సారూప్యముగ యున్నదని మనం చెప్పుకొన్నాము. ఇక్కడ ఒక సంగతిని మనము గమనించవలెను. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలు గాక స్వతంత్రులై యుండి, ధనధాన్యము లతో తులతూగుచు, భారభరితములైన వెట్టిచాకిరిని వారు చేయనవుసరము లేకుండా యుంటే, ఆ దేశమును విడిచి పెట్టుటకు వారెన్నడుకూడ ఆశించి యుండరు. అయితే అతిఘోరమైన రీతిగా వారు బానిసత్వము చేయుచు దాని బరువు వలన వారు మూలుగుచుండిరి. వారి జీవితము సహింప నలవికానిదిగా తయారయ్యెను.

"పాపముచేయు ప్రతివాడును పాపమునకు దాసుడని" యేసుప్రభువు చెప్పెను (యోహాను 8:34). "లోబడు టకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించు కొందురో అది చావు నిమిత్త ముగా పాపమునకేగాని, నీతి నిమిత్త ముగా విధేయతకేగాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా?" యని రోమా 6:16లో అపో.పౌలు వ్రాసెను. సాతానుడు చాలా క్రూరమైన యజమానుడు. మన జీవిత ములను ఈ లోకములోను, రాబోవు లోకములోను కూడ నాశనముచేయు నిమిత్తము మనకు ఒకలాంటి ఎరచూపి మనలను పాపములోనికి నడుపును. "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:26). పాపము గూర్చియు దాని భయంకర రూపమును గూర్చియు, ఫలితములను గూర్చియు మనము కొంచెము తీవ్రముగా ఆలోచిం చిన యెడల దాని బరువైన కాడినుండి తొలగి పోవుటకు మన హృదయాల్లో ఒక గొప్ప ఆశ మొలకెత్తును. ఎవరయితే పాపపు భారము వలన ప్రయాసపడి

యున్నారో ఎవరిమీద దాని కాడి బహు భారముగా యున్నదో అట్టివారు నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును అని యేసు ఆహ్వానించు చున్నారు (మత్తయి 11:28).

ఇశ్రాయేలీయులు తమ బానిసత్వపు భారమును మోయలేక దానినుండి విడుదల పొందగోరి యెహోవాకు మొఱ్ఱ పెట్టిరి. వారు పడుచున్న హింసలను బట్టి దేవుడు వారిపై జాలిగొని ఆయన మోషేకు ప్రత్యక్షమై ఇట్లు చెప్పెను: "ఇశ్రాయేలీయుల మొర నిజముగా నా యొద్దకు చేరినది, ఐగుప్తీయులు వారిని పెట్టుచున్న హింసచూచితిని, కాగా రమ్మునిన్ను ఫరో యొద్దకు పంపెదను; ఇశ్రాయేలీయులైన నాప్రజలను నీవు ఐగుప్తులోనుండి తోడుకొని పోవలెను అనెను" (నిర్గమ 3:9,10). "అధికారి గాను తీర్పరిగాను నిన్ను నియమించిన వాడెవడని వారు (ఇశ్రాయేలీయులు) నిరాకరించిన యీ మోషేను అతనికి పొదలో కనబడిన దేవదూతద్వారా దేవుడు అధికారిగాను విమోచకునిగాను నియమించి పంపెను" అని అపో.కా. 7:35లో వ్రాయబడి యున్నది.

మోషే ఇశ్రాయేలీయులకు అధికారి గాను విమోచకుని గాను దేవునిచే నియమింపబడితే మనకొరకు ఆయన తన ఏకైక కుమారుడైన క్రీస్తును విమోచకునిగా పంపెను. ఇందు నిమిత్తమై ఆయన అలనాడెప్పుడో మోషే ద్వారా బయలు పరచెను. "నీ దేవుడైన యెహోవా నీమధ్యను నావంటి ప్రవక్తను నీ సహోదరులలో నీకొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను. వారి సహోదరులలో నుండి నీవంటి ప్రవక్తను వారికొరకు పుట్టించెదను; అతనిచోట నామాటల నుంచుదును నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పెను. అతడు నా నామమున చెప్పు నామాటలను విననివానిని గూర్చి విచారణ చేసెదను" అని ఆయన మోషేతో చెప్పెను (ద్వితీ 18:15-19). ఆయన మోషే ద్వారా ప్రవచించిన రీతిగానే చేసెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:16,17). "కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" అని అందుకే యేసుక్రీస్తు ప్రకటించెను (యోహాను 8:36).

యేసుక్రీస్తు దేవుడై యుండియు, మరణము యొక్క బలముగల వానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను అనగా నరావతారుడయ్యెను అని హెబ్రీ 2:14,15లో వ్రాయబడి యున్నది.

ఈనాటి లోకము ప్రతివిధమైన పాపముతో మూలుగుచు యున్నది. ఎక్కడ చూచిన అవినీతి, అక్రమము, దొంగతనము దోపిడీ, నరహత్య వ్యభిచారము ఇంకా ఎన్నెన్నో అటువంటి వాటిని గూర్చి మనము ప్రతిరోజు వింటూనే యున్నాము. వార్తాపత్రికలలో చదువుచునే యున్నాము. ఒక్కోసారి మనకండ్లతో చూస్తూనే యున్నాము. అలనాడు ఐగుప్తులో బానిసత్వపు భారము వలన ఇశ్రాయేలీయులు ఎట్లు మూలుగుచు యుండిరో ఆరీతిగా నేటి ప్రపంచము పాపభారముతో మూలుగుచునే యున్నది.

రమ్ము, నిన్న ఫరోయొద్దకు పంపెదను. నీ ప్రజలైన ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి తోడుకొని రావలెను అని యెహోవా మోషేతో చెప్పెను. అయితే ఇశ్రాయేలీయులు తనయందు విశ్వాసముంచని యెడల అతడేమియు చేయలేడని గుర్తించినవాడై "అందుకు మోషే - చిత్తగించుము; వారు నన్ను నమ్మరు నామాట వినరు. యెహోవా నీకు ప్రత్యక్షము కాలేదందురు అని ఆయనకు ఉత్తరమిచ్చెను" (నిర్గమ 4:4).

ఐగుప్తునుండి విమోచింపబడుటకు ఇశ్రాయేలీయులు మోషేయందు ఎట్లు విశ్వాసముంచిరో పాపమునుండి విమోచింపబడుటకు మనము యేసుక్రీస్తునందు విశ్వాసముంచవలెను. "నేను ఆయనని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములోనే మరణింతురు" (యోహాను 8:24); మీరు దేవునియందు విశ్వాసముంచు చున్నారు. నాయందును విశ్వాసముంచుడి యని యేసు చెప్పెను (యోహాను 14:1). "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6).

ఇశ్రాయేలీయులు మోషేను నమ్మునట్లు సూచక క్రియలను చేసే శక్తిని ఆయన మోషేకు ఇచ్చెను. "యెహోవా మోషేతో చెప్పిన మాటలన్నియు అహరోను వివరించి, జనులు యెదుట ఆ సూచక క్రియలను చేయగా జనులు నమ్మిరి. మరియు యెహోవా ఇశ్రాయేలీయులను చూడవచ్చి తనబాధను కనిపెట్టి

నను మాట జనులు విని తలవంచుకొని నమస్కారము చేసిరి (నిర్గమ 4:30, 31). మోషే ద్వారా యెహోవా చేసిన సూచక క్రియల వలన ఇశ్రాయేలీయులు నమ్మిరి.

యేసుక్రీస్తును దేవుడు ఈ లోకమునకు పంపినప్పుడు ఆయనద్వారా సూచక క్రియలను, అద్భుతములను, మహత్కరములను ఎన్నో చేసెను. ఇవన్నీ ఎందువలన ఆయన చేయించెను? యోహాను 20:30,31 ఇట్లు చెప్పుచున్నది; "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంధమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును నమ్మి ఆయన నామమందు విశ్వాసముంచునట్లును ఇవి వ్రాయబడెను". ఆనాడున్న ప్రజలు యేసు యొక్క మాటలను నేరుగా వినిరి, ఆయన చేసిన క్రియలను నేరుగా చూడగల్గిరి. విశ్వ సించిరి. ఈనాడు మనకు ఆయన యందు విశ్వాసమెట్లు కలుగును? "కాగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును. అని రోమా 10:17లో వ్రాయబడి యున్నది. క్రీస్తును గూర్చి ఈనాడు వినుటద్వారా గాని, చదువుట ద్వారా గాని, విశ్వాసము కలుగును.

యెహోవా నిన్ను పంపలేదని ప్రజలు అందురు అని మోషే యెహోనుతో అనగా, దేవుడతనితో యున్నాడని ప్రజలు విశ్వసించునట్లు వారిమధ్య అతడు సూచక క్రియలు చేయగల్గునట్లు దేవుడతనికి శక్తినిచ్చెను. ఈ సూచక క్రియలను చూచుటద్వారా లేక చేయించుటద్వారా దేవుడు వారిని విడుదల చేయించుటకు, వారిని విమోచించుటకు నిశ్చయించుకొన్నాడని వారికొక నిర్ధారణ యేర్పడెను. తద్వారా మోషే అందించు వర్తమానము యధార్థమని వారు నమ్మిరి నమ్మగల్గిరి.

యేసుప్రభువునందు మనము విశ్వసించునట్లు ఆయన ద్వారా దేవుడనేక గొప్ప కార్యములను చేసెను. పాపులను విమోచించుటకు ఆయన మనకొక గొప్ప నిర్ధారణ నిచ్చెను. మనము చేయవలసినదంతా ఆయనయందు విశ్వాసముంచడమే. ఆయన చెప్పినట్లు చేయడమే.

నీవు క్రీస్తునందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, యేసుప్రభువని నీ నోటితో ఒప్పుకొనుము, బాప్తిస్మము పొందుము అని ఆయనే ఈనాడు నీకు చెప్పుచున్నారు. పాపమనే భారమైన కాడినుండి నీవు విడుదల పొందగోరుచున్న యెడల యేసుక్రీస్తు మాటలను వినుము : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును. నమ్మనివానికి శిక్ష విధించబడును" అని ఆయనే చెప్పెను. నీవీమాటలను నమ్ముచున్నావా?

– జాషువా గూటం

# గొప్ప బైబిలు ప్రశ్నలు

(Great Bible Questions)

బైబిలును దాని బోధలను ఎరిగిన వారు, దానియందు బహుగా విశ్వాస ముంచెదరు. మరియే గ్రంధము కూడా జవాబు చెప్పలేనట్టి కొన్ని మానవ సమస్యలకు బైబిలు జవాబు లిచ్చుచున్నది. అయితే మనము దిగువ చర్చించుకొను ప్రశ్నలకు మానవుడు ఎల్లప్పుడు జవాబు కొనుగొనాలని తపన పడుతూ యుంటాడు.

**1. మనుష్యుడు ఎక్కడ నుండి వచ్చాడు? (మానవుని జన్మ)**

డార్విన్ అనే శాస్త్రవేత్త మనుష్యుడు కోతి నుండి వచ్చెను అని ప్రబోధించెను. అయితే లేఖనములు దీనిని ఖండించు చున్నవి. మానవుడు దేవుని స్వరూప మందు చేయబడెను అని లేఖనములు బోధించుచున్నవి. దేవుడు తన స్వరూప మందు నరుని సృజించెను. "దేవుని స్వరూప మందు వాని సృజించెను; స్త్రీనిగాని పురుషునిగాను వారి సృజించెను" (ఆదికాండము 1:27).

"దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రము లలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆదికాండము 2:7). "మరియు యావద్భూమి మీద కాపుర ముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందు రేమో యనీ, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండు వాడుకాడు" (అపొస్తలుల కార్యములు 17:26-27). పై లేఖనములు బట్టి గమనించినట్లయితే డార్విన్ యొక్క సిద్ధాంతము తప్పు అని లేఖనములు ఋజువుపరచుచున్నవి.

ఉదాహరణ : మనుష్యుడు - మనుష్యుని నుండి వచ్చెను, కోతి-కోతి నుండి వచ్చెను, కుక్క-కుక్క నుండి వచ్చెను. మనుష్యుడు కోతి నుండి రావటం లేదు, కోతి మనుష్యుని నుండి రావటం లేదు.

**మనము అసలు ఎందుకు జీవించుచున్నాము ?**

ప్రతివానికి నేను ఎందుకు ఉన్నాను అను ప్రశ్న రావచ్చును. మనము తినడానికి ఉన్నామా? నిద్రపోవడానికి ఉన్నామా? ఈ రెండు ఉండాలి, వాటిని దేవుడే ఇచ్చును. జీవితము యొక్క ముఖ్య ఉద్దేశ్యము "మనము దేవుని మహిమ

పరచాలి."

"నా మహిమ నిమిత్తము నేను సృజించినవారిని నా నామము పెట్టబడిన వారినందరిని తెప్పించుము. నేనే వారిని కలుగజేసితిని వారిని పుట్టించినవాడను నేను" (యెషయా 43:7). ఆయన మనలను సృజించెను. గనుక మనము దేవుని మహిమ పరచాలి. దేవుని యొక్క చిత్తమును జరిగించుటకు, ఆయన మన యెడల ఒక ఉద్దేశ్యము కలిగియుండును. "మీరు బహుగా ఫలించుట వలన నాతండ్రి మహిమ పరచబడును; ఇందు వలన మీరు నా శిష్యులగుదురు" (యోహాను 15:8). క్రీస్తును మహిమ పరచినట్లయితే ఫలములు ఫలించాలి. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగ మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1) అని అపొస్తలుడైన పౌలు చెప్పెను. గనుక మన జీవితమును దేవునికి సమర్పించుకోవాలి. క్రీస్తు సంఘములో మనము ఒక మూలస్తంభముగా ఉండుటకు ప్రయత్నించాలి. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తనప్రాణమునకు ప్రతిగా నేమి యియ్యగలడు? మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును" (మత్తయి సువార్త 16:26-27). కేవలం మనము ఇష్టాను సారముగా జీవించుటకు ఇక్కడలేము గనుక నీవు దేవుని మహిమ పరచువారిగా ఉన్నావా? నీస్వబుద్ధిని ఆధారము చేసుకొని జీవించువానిగా ఉన్నావా?

### 3. మనము ఎక్కడికి పోవు చున్నాము?

చాలా మంది తలంచేది ఏమిటి అంటే మనము మరణించిన తరువాత మరల కుక్కలాగో లేక ఏదో ఒక జంతువులాగో పుట్టతాము అని తలంచెదరు. దేవుని వాక్యము ఈలాగు సెలవిచ్చుచున్నది.

"మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మదాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). నీవు మరణించిన తరువాత ఒక జంతువుగా జన్మించవు కాని ఆత్మ దానిని దయచేసిన దేవుని యొద్దకు పోవునని బైబిలు చెప్పుచున్నది. నరునికి ఆత్మ యెహోవా పెట్టిన దీపము (సామెతలు 20:27). నీవు మనుష్యులను మట్టికి మార్చుచున్నావు నరులారా

తిరిగి రండని నీవు సెలవిచ్చుచున్నావు (కీర్తనలు 90:3). మరియు క్రీస్తు ఇట్లనెను: "మీ హృదయములను కలవరపడ నియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి. నాతండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును, మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" (యోహాను 14:1-3).

మనము మరణించిన తరువాత ఎక్కడికి పోవుదుము? ప్రభువు మరల వచ్చినప్పుడు క్రీస్తు చేత విమోచించబడిన వారు "నాతండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" యని చెప్పును. దేవునికి వేరుగా జీవించిన వారితో శపింపబడిన వారలారా, నిత్యాగ్ని లోనికి పోవుడి. వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు (మత్తయి సువార్త 25:31-46) అని వ్రాయబడి యున్నది.

ప్రియులారా మానవ సమస్యలకు జవాబిచ్చునది బైబిలు గ్రంథము ఒక్కటే. మనుష్యుడు ఎక్కడ నుండి వచ్చాడు? మనము అసలు ఎందుకు ఉన్నాము? మనము ఎక్కడికి తిరిగి పోవుచున్నాము? అనువాటికి జవాబు ఈకొద్ది పాఠము ద్వారా తెలుసుకొన్నాము గనుక నిలువరమైన పట్టణములో ఉండ గోరిన యెడల యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుడి, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిడి.

– ఎ. గోపాలకృష్ణ

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

# క్రైస్తవ గృహం

## (వివాహం, విడాకులు, పునర్వివాహమును గూర్చిన దేవుని చట్టము)

ప్రపంచమందంతటాయున్న సంఘాలలో వివాహం, విడాకులు, పునర్వివాహమును గూర్చిన సమస్య ఇప్పుడు ఎక్కువ ప్రబలియున్నది. దీన్ని గూర్చి పరిశుద్ధాత్మావేశముచే లిఖింపబడిన బైబిలు యేమి చెప్పుచున్నదో తెలిసికొనుట అవసరం. ఈ అంశం అనేక హృదయాలను కలవరపరచినా ప్రజలు దేవుని చిత్తానికి లోబడాలని బోధించుట అవసరం. అది వారిని నిత్యరక్షణలోనికి నడిపిస్తాది (హెబ్రీ 5:9). యిదొక అపాయకరమైన సమస్య, ముఖ్యంగా యువకులు ఎదుర్కొనుచున్న పెద్ద సమస్య. పాశ్చాత్యదేశాల్లో యించుమించు అన్ని సంఘాల్లోను విడాకులిచ్చి పునర్వివాహము చేసికొన్న సభ్యులున్నారు.

### గృహము, వివాహము - ప్రభువు నిర్వచనము

గృహము దేవుని వలన ఆరంభించబడినది. ఆయన ప్రేమించినది. ప్రతి దేశ భాషలోను మధురమైన మాట అది. కాలారంభములో దేవుడు గృహాన్ని సృజించారు. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది.కా. 1:1). సృష్టిఅంతయు జరిగినయనంతరము దేవుడు మానవుని తన స్వరూపమందు తన పోలిక చొప్పున సృజించెను. స్త్రీనిగాను పురుషునిగాను ఆయన వారిని సృజించెను (ఆది.కా. 1:27). తదుపరి లేఖనాలు ఇట్లు చెప్పుచున్నవి. "దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో యుంచెను. మరియు దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను" (ఆది.కా. 2:8, 18)..

పరదైసువలెనున్న ఆ సుందర వనంలో ఆదాముకు సాటియైన సహాయము లేకపోయెను (1:20). జంతువులకుండెను గాని మానవునికి సాటియైన సహాయము లేకపోయెను. జంతువులలో ఏదియు ఆదాముకు సరిజాలక పోయెను. అప్పుడు దేవుడు ఆదాముకు గాఢ నిద్ర కలుగజేసి, అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి దానిని మొదటి స్త్రీగా నిర్మించి ఆదాముకు ఆమెను సమర్పించెను. తదుపరి ఆదాము యొక్క సంతోషము పరిపూర్ణమాయెను. తరువాత దేవుడు వైవాహిక చట్టము నిచ్చెను. "కాబట్టి పురుషుడు తన తండ్రిని

తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును, వారు ఏక శరీరమై యుందురు" (ఆది.కా. 2:24).

### గృహము ఒక గొప్ప బహుమానము

మన సృష్టికర్త యిచ్చిన గొప్ప బహుమానములలో గృహము ఒకటి. మానవుని ఆత్మీయ అంతర్భాగములలో గృహ సంబంధమైన బాంధవ్యము గొప్పది. మనం మన యింటిని గూర్చి మాట్లాడుచున్నప్పుడు ఇంట్లో తండ్రి పవిత్ర ప్రేమను, తల్లి అనురాగమును, సోదర సోదరీల ప్రేమను గూర్చి ఆలోచిస్తాము. మనుష్యులు తరచు తమ గృహమును గూర్చిన మధురానుభూతులు యితరులతో పంచుకొంటారు. తమ చిన్ననాటి గృహాన్ని గూర్చి చెప్పుటలో వారి మనసులు ఆనందడోలికలలో అల్లాడుచుంటాయి.

ఐశ్వర్యమున్నా లేకపోయినా గృహం మన జీవితాలకు పవిత్ర ఆశ్రయమై యుండాలి. మంచి గృహములో యున్న ప్రేమానురాగములు ప్రశంసనీయము. తద్వారా మన సాంఘిక సంబంధ బాంధవ్యాలు ఏర్పడతాయి. దాన్ని పరలోకం కూడా ఆమోదిస్తాది. "రాజైనా, రైతయినా ఇంట్లో శాంతిననుభవించే వాడు ఆనంద భరితుడు".

మానవుడు తన క్రైస్తవ లక్షణాలను అలవరచుకొనుటకు గాను గృహం ఒక విశిష్టమైన విశ్రాంతి స్థలమై యున్నది. నిజానికి మానవునికి రూపు దిద్దునది గృహమే. గృహం ఎట్లుంటే దేశం కూడా అట్లే. సక్రమముగా నడుచు గృహములే దేశానికి శక్తి. పరదైసు ఆదాము యొక్క గృహం. అతని సంతతిలో మంచి వారికి గృహమే పరదైసు. సమాజము యొక్క ప్రాధమిక ప్రామాణికమే గృహం.

మన గృహాల్లోయున్న వాతావరణాన్ని బట్టి పిల్లలు బహుగా ప్రభావితులవుతారు. మానవ సద్గుణాలకు ప్రాముఖ్య తర్ఫీదు స్థానం గృహమే. మన గృహాల్లో బిడ్డలు జన్మిస్తారు. ఈ గృహాల ముద్రను వేసుకొనివారు బయటికి వెళ్తారు. గృహాలు ఎట్లుంటే పిల్లలు అట్లుంటారు. అందుకే "బాలుడు నడువ వలసి త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు" అని సొలొమోను వ్రాసాడు (సామె 22:6).

మంచి కొరకు క్రైస్తవ గృహం ఒక గొప్పశక్తి. క్రైస్తవ గృహాల కొరకు మనం ఎల్లప్పుడు కృతజ్ఞత కలిగి యుండాలి. క్రైస్తవ విలువలపై నిర్మించబడిన గృహాలే నేటిలోకానికి గొప్ప అవసరతయై యున్నది. మంచి గృహములను నిర్మించుట కంటే శ్రేష్టమైనది ఇంకోటి లేదు.

పిల్లలకు గృహం ఆత్మీయ శిక్షణ

స్థావరమై యుండాలని దేవుడు కోరుచున్నారు. యిదే సంగతిని మోషే ఇశ్రాయేలీయులకు ద్వితీయో 6:5-9లో బోధించాడు. "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ శక్తితోను నీదేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేను నీకాజ్ఞాపించు మాటలు నీ హృదయములో నుండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపచేసిన నీ యింట కూర్చుండునప్పుడును, త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను".

"తండ్రులారా ప్రభువు యొక్క బోధలోను శిక్షలోను" మీ బిడ్డలను పెంచుడియని పౌలు తండ్రులకు హెచ్చరిక చేసాడు (ఎఫెసీ 6:4). దేవుడు బిడ్డలను సంఘానికి, దేశానికి గాక తలిదండ్రులకిచ్చాడు. అందువలన తమ బిడ్డలకు సరిగా ఉపదేశించడానికి, వారి ముందు మంచి మాదిరి యుంచడానికి తలిదండ్రులు బాధ్యత కలిగియున్నారు. ఈ విషయంలో సంఘము కూడ సహాయపడాలి.

### గృహం, దేవుని భద్రత

బైబిలులో దేవుడు గృహానికి వివాహానికి గొప్ప ఘనత యిచ్చారు. అయినను దైవోపదేశమునకు భిన్నముగా గృహాన్ని గూర్చిన దేవుని సంకల్పము పలు విధ లుగా బహిష్కరింప బడుచున్నది. తత్ఫలిత ముగా అనేక దేశములు తీవ్ర నైతిక ఆత్మీయ పతనమునకు గురియగు చున్నవి జారత్వము కొన్ని దేశాలకు జాతీయ క్రీడగా అగుపడుచున్నది. స్త్రీ పురుష వివాహాన్ని కొందరు అపహాస్యము చేయు చున్నారు. వివాహ చట్టాలను గూర్చి అనేకులు తప్పుడు అభిప్రాయములన కలిగియున్నారు. క్రైస్తవ్యము పేరుత వివాహము, విడాకులు, పునర్వివా హమును గూర్చి బోధింప బడునది క్రొత్తనిబంధనలో బోధింపబడిన దానికి భిన్నముగా యున్నది. ఎంత విచారము

భార్య భర్తల ప్రేమ సంబంధము పిల్లల ప్రేమ, అన్నదమ్ముల అనురాగ యిదంతా గృహం అవుతాది. ప్రతి గృహ అట్లుండాలని దేవుడు కోరుచున్నారు క్రైస్తవ ఉపదేశమును అనుసరించ గృహాలకంటె అందమైనది ఈ లోకంలో వేరొకటి యుండదు. "క్రీస్తు ఈ గృహమ నకు శిరస్సు అయ్యున్నాడు" అనే సూచి అనేక గృహాల్లో గోడలపై మనకు కనబ తాది. అదే నిజమైతే ఆ కుటుంబమ ధన్యకరము! మంచి కుటుంబముగ యుండాలని ప్రతి గృహము కాంక్షించాలి ఆనందమయమైన వైవాహిక జీవితం కుటుంబము ఈ భూమిపై పరలోకమ లాంటిదే. అయితే దేవుని చిత్తమ

జరిగించుటే ప్రతి గృహము యొక్క ధ్యేయమై యుండాలి (మత్తయి 6:33; 10:37-39; లూకా 14:26-27). దేవుని దీవెనలుంటే ఆయన కోరు రీతిగా గృహం ఉంటాది. అయితే గృహంలో నిజమైన ప్రేమ, అనురాగము, విధేయత లేని యెడల అది పేరుమట్టుకే గృహం. ఒక పూరిల్లులో విస్తారమైన సామగ్రి పట్టవు. గాని దానిలో దేవుడుంటే గొప్ప భవంతుల కంటే ఎక్కువ ప్రేమ పట్టును.

మానవుని విజయం అతని గృహ గుణగుణాలపై ఎక్కువ ఆధారపడి యుంటాది. అతని ఆదరించేవారు యింటిలో ఎవరు లేకపోతే, ఇంట్లో నిర్లక్ష్యం ఉదాసీనత యుంటే, అతడు పైకి ధనాభివృద్ధి జెందుచున్నా, లోలోపల అంతా అతనికి అంధకారమే. విడాకుల విషం నేటి సమాజ ఉనికినే కంపింప జేయు చున్నది. అయితే గృహాన్ని క్రైస్తవ గృహంగా చేయుట వలన అది సరిచేయ బడగలదు. నిజానికి "కలసి ప్రార్థించే కుటుంబమే కలసి మెలసి యుంటాది".

**గృహము: వివాహము, విడాకులు, పునర్వివాహము దేవుని చట్టము**

వివాహమాడదలచిన వారందరికీ దేవుడు వివాహమును సంకల్పించెను. అయితే గృహపవిత్రతను కాపాడుటకు గాను ఆయన చట్టముల నిచ్చెను. యేసు కొండమీద చేసిన ప్రసంగములో ఇట్లుచెప్పెను: "నేను మీతో చెప్పునదేమ నగా వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు" (మత్తయి 5:32).

తరువాత ఆయనను శోధిస్తూ పరిసయ్యులు వివాహము, విడాకులను గూర్చి క్రీస్తును ప్రశ్నించారు. దేవుడు ఆదిలో యేమి చేసెనో యేసువారికి జ్ఞాపకం చేసారు. ఆయన ఒక పురుషునికి ఒక స్త్రీని చేసెను. ఒక పురుషుని కొరకు ఇద్దరు ముగ్గురు స్త్రీలను కాదు, ఒక స్త్రీ కొరకు ఇద్దరు ముగ్గురు పురుషులను కాదు (మత్తయి 19:3-8). "కాబట్టి దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరు పరచకూడదని" ఆయన చెప్పెను (మత్త 19:6). వివాహములో దేవుడు పురుషుని స్త్రీని జతపరుస్తారు. వారిని జతపర్చేది మానవుడు కాదు. వివాహము చట్టపరమైన సాంఘిక ఒడంబడిక మాత్రమే కాదు. అదొక దైవిక వ్యవస్థ. అయితే అమెరికాలోను, అనేక దేశాల్లోను క్రీస్తు యిచ్చిన చట్టమును బట్టిగాక అనేక కారణాల వలన విడాకులు యిచ్చే చట్టములను ప్రభుత్వములు అమలు పరచుట విచారకరము. ఒక పురుషుడు, స్త్రీ వివాహ ప్రమాణములను చేయున

పుడు మరణ పర్యంతము కలిసి సంసారము చేయుటకు నిశ్చయించుకొనవలెను. ఆదిలో దేవుని సంకల్పము అట్లే యుండెను. జీవితాంతము వరకు ఒకే పురుషునికి ఒకే స్త్రీ. అయితే అమెరికాలో విడాకులకు లోనైన వారి సంఖ్య పెచ్చు పెరిగిపోతుంది. పెండ్లాడిన 5 సంవత్సరములలోపే అమెరికాలో నూటికి 43 కుటుంబాలు విడాకుల వలన విడిపోవుచున్నారు. ఈ మధ్యకాలంలో పరిత్యాగము పునర్వివాహము అనేవి సాంఘిక ఆమోదమును సంతరించుకొన్నాయి. అమెరికాలో సంవత్సరానికి 10 లక్షల మంది విడాకులు తీసికొని విడిపోవు చున్నారు. వివాహము కాకుండగనే అనేకులు సంసారం చేస్తున్నారు. గర్భవిచ్ఛిత్తిలు భయంకరంగా పెరిగిపోవుచున్నాయి. 19 సంవత్సరములలోపే వివాహమాడిన వారిలో నూటికి 85 మంది వాడాకులకు లోనగుచున్నారు. అందువలననే అక్కడ నైతిక పతనం ఆరంభమయ్యింది.

పరిత్యాగం, పునర్వివాహములకు వ్యతిరేకముగా సంఘాలలో పెద్దగా బోధింపబడుటలేదు. భార్యను పరిత్యజించుట అసహ్యకరమైన పనియని బైబిలు చెప్పుచున్నది (మలాకీ 2:16). దేవుని చట్టప్రకారము కాకుండా కుటుంబాలు నిర్మించబడుచున్నవి గనుక విడాకుల సంఖ్య పెరిగిపోవుచున్నది.

మనం మన యువకులను సద్వర్తునలనుగాను, సత్‌శీలురుగను యుండునట్లు శిక్షణ ఇయ్యాలి. వారు సత్ప్రవర్తన గలవారినే తమ జీవిత భాగస్వాములుగా ఎంచుకొంటే పరిత్యాగ పద్ధతి క్షీణించిపోవును. విడిపోయిన గృహాల నుండియే యువక నేరస్థులు తయారవుతారు. ఒక వివాహము పతనమైపోయినపుడు, ఆత్మనాశన మగును.

పురుషుడు తన భార్యను హత్తుకొనును అని దేవుడు చెప్పినప్పుడు ఆయన బలమైన పదాన్ని వినియోగించారు. భార్యభర్తలు ఒండొరులకు జిగురువలె అంటుకొని యుండాలి. అక్రమ సంబంధము వలన వివాహము వీగిపోవును.

భూమిని నిండించుట వివాహములో యున్న ఒక ప్రయోజనము. యిది దేవుని నియమప్రకారం జరగాలి (ఆది.కా. 1:28). తరువాత వివాహమాడిన వ్యక్తి సుఖము, సంతోషము అనుభవించడానికి వివాహము ఉద్దేశించబడినదని పౌలు బోధించుచున్నాడు (1 కొరింథి 7:2-5). అయితే వివాహ సంబంధమైన పవిత్ర ప్రమాణములను ఉల్లంఘించు దేశము నిలబడలేదు.

వివాహ విషయంలో పరిశుద్ధలేఖ

నాలకు భిన్నముగా యున్న బోధ ఏదైనను, ఏ దేశచట్టమైనను దేవుని చట్టానికి భిన్నముగా చేయు పోరాటమే. దేవుడు జతపరచిన దానిని మానవుడు వేరు చేయకూడదు. దంపతులలో ఒకరు జారత్వము చేస్తే వారిలో అమాయకులు విడాకులు యిచ్చి పునర్వివాహము చేసికొనవచ్చును. ఒకరి జీవిత భాగస్వామి జారత్వము చేస్తే అపరాధము చేసిన వ్యక్తికి విడాకులు యిచ్చి వేరొక వ్యక్తిని వివాహమాడవచ్చును. అది వ్యభిచారము కాదు.

వివాహము పరిత్యాగము, పునర్వివాహము అంశముపై మన ప్రభువు యేమి బోధించెనో దానినే నమ్మకమైన బోధకులు, ఉపదేశకులు బోధిస్తారు. ఒకే ఒక్క నేరం జారత్వము ఒక్కటే పరిత్యాగాన్ని పునర్వివాహాన్ని న్యాయంగా పరిగణిస్తోంది. అందువలన జారత్వ కారణము వలన గాక యితర కారణాల వలన పరిత్యాగము పొంది పునర్వివాహము జరిగించుకొన్న వివాహము లన్నియు వ్యభిచారమే. హేరోదు రాజు "తన సోదరుడైన ఫిలిప్పు యొక్క భార్యను ఉంచుకొనుట న్యాయము కాదని" బాప్తిస్మమిచ్చు యోహాను అతనికి చెప్పెను (మత్తయి 14:3-4). అట్లు చెప్పినందు వలన యోహాను తల నరకబడెను (మత్త 14:9-12; మార్కు 6:18).

అపరాధము చేసిన వ్యక్తి తిరిగి వివాహమాడవచ్చునని యేసు చెప్పలేదు. దేవుని సంకల్పం ఒక్కటే - ఒకే పురుషుడు ఒకే స్త్రీకి కట్టుబడి మరణం వారిని వేరు చేయువరకు జతగానే యుండాలి.

ఈ విషయంలో ప్రభువు బోధ విపులంగానే యున్నది. ఆదాము హవ్వను పరిత్యజించి వేరొక స్త్రీని వివాహమాడ లేదు! అక్కడ ఇంకో స్త్రీ లేనే లేదు! ఒకే పురుషునికి ఒకే స్త్రీతో జీవితాంతం వివాహమే యెహోవా దేవుని ఆదిమ సంకల్పం. భూసంబంధ చట్టము లేవియు ఆ చట్టాన్ని మార్చలేవు. ముడి వేసే వాడు దేవుడే. దాన్ని విప్పేవాడు దేవుడే.

ఈ అంశముపై నేడు తీవ్రముగా బోధించవలసిన ఆవశ్యకత యున్నది. లైంగిక సంబంధ విషయాల్లో దేవుని చట్టాన్ని ఉల్లంఘించునట్లు ప్రోత్సహించు రీతి మన టి.వి. కార్యక్రమాలు, వార్త పత్రికలు, వీడియోలు, వీక్లీలు, తదితర సాహిత్యము ప్రజలను ప్రోత్సహించు చున్నాయి. అయితే ప్రేమ కలిగి సత్యమును చెప్పునట్లు దేవుడు మనకు సహాయం చేయునుగాక! (ఎఫెసీ 4:15).

\- పెర్రికోతమ్

(సశేషం)

# బాప్తిస్మమును గురించిన సత్యసూక్తులు

మరణ పునరుత్థాన స్మరణ చిహ్నంబైన
బాప్తిస్మము ప్రభువు బడయలేద?
నమ్ము బాప్తిస్మము నరుల రక్షణ యంచు
క్రీస్కు బల్కిన సూక్తి వాస్తవంబు.
నీటి సాదృశ్యమే నిజముగా రక్షించి
ప్రళయంబు ననునోవా బ్రతికినట్లు
దైవ తనయుండైన ధర్మంబు బాటింప
నీటి బాప్తిస్మము నేర్పె మనకు.
తిరిగి జన్మించుడీ దివ్య స్నానముతోడ
నూత్న త్వ మగునని నుడువలేద?
తైలాభిషేకంబు తగురీతి ప్రోక్షించు
పితరుల కాలంబు గతియు జెందె.
బాప్తిస్మము బొంది ప్రజలలో యలనాడు
పౌలు వలన మరల బడయలేద?
యేసుక్రీస్తు నెవరు యేకైక ప్రభువని
విశ్వసించి మదిని వెలికి దెలిపి
మారు మనసు బొంది మరి రక్షణార్థమై
పాపములను గడిగి పరముజేరు.
ఎంచుకొనుడి మీకు యేది యిష్టంబౌనో
జీవ, మరణములలో జేరనొకటి
ప్రభువ, ప్రభువయంచు పలుమారు బలికిన
తండ్రి చిత్తమరయు టదియెరక్ష
పలురక బాప్తీస్మంబులు
కలవు గనుక వేరువేరు కాలంబులలో
నిలిపెను దైవంబొకటియె.
పలువురు రక్షించ గలుగు పాపికి మార్గం
మనుజు లెల్లను బాప్తిస్మ మరణమందు
పాతిపెట్టు కొసగిన ప్రభుని యాజ్ఞ
మరణమొందియు జన్మించు మార్గమొకటె
నిలచి యున్నది క్రైస్తవా నేడు మనకు.

(రోమ 6:4; మత్త 3:15; మార్కు 16:16; యోహా 3:5; తీతు 3:5; 1 పేతు 3:21; 1 కొరి 10:2; యోహా 3:5; రోమ 6:4; లేవి 14:16; నిర్గ 34:27; అ.కార్య 19:5; యోహా 20:31; రోమ 10:10; కార్య 22:16; ఎఫె 5:27; రోమ 6:16; మత్త 7:21; యోహా 12:50; మత్త 3:11-13; ఎఫె 4:4; 1 తిమోతి 2:11-13; రోమ 6:3; కార్య 10:48,4:12; కొల 2:12; 1 యోహా 5:6)

\- సాతులూరి థామస్ జయరావ్, నర్సారావ్ పేట.

ఎగ్జిబిషన్ ప్రారంభించిరి. రిక్కీగారు, పి.పాల్ (మిర్యాలగూడ) గార్లు వాక్యపరిచర్య చేసిరి. మధ్యాహ్న కాల కూటమునకు సోదరులు కె.బి.బి. చంద్రపాల్ గారు హాజరై వాక్యపరిచర్య చేసిరి. విద్యార్థులకు బహుమతుల నిచ్చుటలో సహకరించిరి. తిమోతి బైబిలు స్కూల్ ఫర్ రూరల్ యూత్‌లో నెలకు రెండు రోజులు (సెలవు దినాల్లో) బైబిలు క్లాసులు నిర్వహించబడు చున్నవి. యువకులు వాక్యపరిచర్యలో ప్రోత్సహించబడుచున్నారు. సోదరులు పి.విజయబాబు గారి ఆధ్వర్యంలో చనుబండ క్రీస్తు సంఘము ఈ పనిని సమర్ధవంతముగా నడిపించు చున్నారు. సోదరులు కె.శాంతకుమార్, కె.బాలస్వామి మరియు పి.రవికుమార్ గార్లు అక్కడ టీచర్లుగా పనిచేయు చున్నారు.

సెప్టెంబరు 15,16,17 తేదీలలో సత్యవాణి క్రీస్తు సంఘము కాకినాడ అంబేద్కర్ భవన్‌లో గొప్పబైబిలు లెక్చర్‌షిప్‌ను నిర్వహించిరి. ఆ కూటములకు ఆంధ్రప్రదేశ్ నుండి కర్నాటక నుండి వచ్చిన వందలాది ప్రజలు హాజరైరి. ప్రతికూటమునకు సగటున 650 మంది హాజరైరి. ఆ కూటములలో అమెరికా నుండి వచ్చిన సోదరులు డా॥ కెన్ ఇయర్‌వుడ్, జేక్ తిబొడో, పాల్‌జోన్స్, చేడ్‌హెవిలాండ్, రిక్కిగూటం గార్లను, జాషువాగూటం గార్లను వాక్యపరిచర్య చేసిరి. 13మంది క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. హాజరైన వందలాది ప్రజలకు స్థానిక సంఘము చక్కటి భోజన, వసతుల నేర్పాటు చేసిరి. ఆ మూడు దినములలోను ప్రభువు మంచి వాతావరణము ననుగ్రహించగా అందరు గొప్ప ఆత్మీయ మేలును పొంది దేవుని స్తుతించిరి.

పైనుదహరించిన అమెరికా సోదరులు, వారితో వచ్చిన పేట్‌ఇయర్‌వుడ్, మెలిస్సాపూల్ అనుసోదరీలు తదుపరి పెద్దనాపల్లి, పొమ్మంగి, జెడ్-రాగంపేట, ఏలేశ్వరం, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, తామరాడ, కురెళ్లగూడెం, విజయవాడ లలో జరుపబడిన కూటములలో పాల్గొనిరి. తత్ఫలితముగా మొత్తం 45గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

తుఫాను వలన కొన్ని గ్రామములను సోదరులు దర్శించలేక పోయిన
సెప్టెంబరు 23వ తేది శుక్రవారం విజయవాడ ఏరియాలోని కొన్ని స్థాని
సంఘములు ప్రెస్‌క్లబ్ ఆడిటోరియంలో ఒక రోజు బైబిలు క్లాస
సువార్తకూటము నిర్వహించిరి. రాత్రివేళ జరిగిన కూటములో అమెరిక
సోదరులు కెన్ ఇయర్‌వుడ్, జేక్ తిబొడో గార్లు వాక్యపరిచర్య చేసి
రిక్కీ గూటంగారు జాషువా గూటం గార్లు తర్జుమా చేసిరి. ఉ
కూటములకు సోదరులు పి. అబ్రాహాము గారు, గుంటూరు జిల్లా నుం
సోదరులు సి.హెచ్ విక్టర్ డేనియర్ గార్లు సారధ్యము వహించి చక్క
నడిపించిరి. వచ్చిన వారందరికీ ఉచిత భోజనసదుపాయం కల్పిం
బడెను. కూటము అనంతరము ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొంద
అమెరికా సోదరులు సెప్టెంబరు 25న బయలుదేరి తమ స్వదేశమున
సురక్షితముగా చేరుకొనిరి.

RNI Road No. 69973/98
Postal Regd. No. VM/KD/02

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Jashuva Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 (